మరపురాని మహానేత వైఎస్సార్

- వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘన నివాళులర్పించిన నేతలు
- ఆదాల ఆదేశాలతో కరెంటాఫీస్ సెంటర్‌లో కార్యక్రమం
- గాంధీబొమ్మ సెంటర్లో విగ్రహానికి పూలమాల వేసిన పర్వతరెడ్డి

నెల్లూరు సిటీ: 'వైఎస్ రాజశేఖరరెడ్డి కోట్లాది మంది గుండెల్లో గూడు కట్టుకున్న మహానేత. ఆయన ప్రజల కోసం ఎంతో చేశారు' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సారథ్యంలో నెల్లూరు కరెంటాఫీస్ సెంటర్‌లో సోమవారం వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కాకాణి రూరల్ నేతలు, ప్రజాప్రతినిధులతో కలిసి రాజన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రంగారెడ్డి మీడియాతో మాట్లాడుతూ పేదల కోసం వైఎస్సార్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, పాశం శ్రీనివాస్, పేర్నాటి కోటేశ్వరరెడ్డి, లంక రామ్‌శివారెడ్డి, బట్టేపాటి నరేంద్రరెడ్డి, మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, పాలకీర్తి రవికుమార్, సన్నపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఏసునాయుడు, చెన్నారెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, ఉడతా మురళి యాదవ్, కొండా సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా..

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలన అందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి సోమవారం ఆయన, నగర నియోజకవర్గ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ ఆశీస్సులతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా వచ్చి మరింత మెరుగైన పాలన అందిస్తారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వేలూరు మహేష్, నీలి రాఘవరావు, ఓబిలి రవిచంద్ర, మద్దినేని మస్తానమ్మ, కామాక్షిదేవి, ఊటుకూరు నాగార్జున, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, పోట్లూరి రామకృష్ణ ఆచారి, గుంజి జయలక్ష్మి, నాయకులు కొణిదల సుధీర్, హంజా హుస్సేనీ, గణేశం వెంకటేశ్వర్లురెడ్డి, నేతాజీ సుబ్బారెడ్డి, వావిలేటి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



కరెంటాఫీస్ సెంటర్‌లో నివాళులర్పించిన కాకాణి, రంగారెడ్డి, నాయకులు



గాంధీబొమ్మ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నాయకులు

పేదలకు అన్నదానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సోమవారం నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురం సెంటర్‌లో కార్యక్రమాలు జరిగాయి. పార్టీ కార్యాలయంలో రాజన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదనం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి వెంగళరెడ్డి, నాయకులు విజయ్, బ్రహ్మరెడ్డి, లక్ష్మీనారాయణ, నిర్మల, విజయ్‌మోహన్, గురుప్రసాద్, నానీ, కల్యాణ్, సంపూర్ణ, వెంకటరమణమ్మ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నాయకులు

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



మేకపాటిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను శాలువాతో సత్కరించారు. పలు అంశాలపై చర్చించారు.

వసుంధరాదేవికి ఘన సన్మానం

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డాక్టర్ వసుంధరాదేవి పదవీ విరమణ సన్మాన సభను సోమవారం నిర్వహించారు. దర్గామిట్టలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆర్థోపెడిక్ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ మస్తాన్‌బాషా మాట్లాడుతూ గతంలో ఒకటి రెండు విభాగాల్లో మినహా మెడికల్ కళాశాలలో పీజీ సీట్లు కూడా లేవన్నారు. వసుంధరాదేవి బాధ్యతలు చేపట్టాక ఎంసీఐ నిబంధనలను పాటించి సౌకర్యాలు ఏర్పాటు చేయడం ద్వారా గైనకాలజీ, ఆర్థోపెడిక్, మానసిక, జనరల్ సర్జరీ, న్యూరాలజీ తదితర పలు విభాగాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులకు పీజీ సీట్లు వచ్చాయన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ నరేంద్ర, డాక్టర్ వీరనారాయణ, మహిళా వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎంపిక



నెల్లూరు(టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో సోమవారం 20 మంది విద్యార్థులను ఎన్‌సీసీ నావల్ క్యాడెట్స్‌గా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గిరి, కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొడంగవే, నావల్ యూనిట్ టేక్ కేర్ దివ్య, సూపరింటెండెంట్ ముకుంద సాగర్, స్టాఫ్ ఆఫీసర్ వెంకటేష్ రాథోడ్, అధ్యాపకులు ప్రసాద్, సత్యనారాయణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీఎఫ్‌ఏ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యం వర్ధంతి



నెల్లూరు(బారకాసు): దివంగత ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ సుబ్రహ్మణ్యం వర్ధంతిని బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ (బీఎఫ్‌ఏ) ఆధ్వర్యంలో సోమవారం రూరల్ పరిధిలోని బురాన్‌పూర్ ప్రాంతంలో నిర్వహించారు. సుబ్రహ్మణ్యం సమాధి వద్ద పలువురు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎఫ్‌ఏ చైర్మన్ విశ్రాంత అడిషనల్ చీఫ్ సెక్రటరీ కర్రా పరశురామయ్య, జనరల్ సెక్రటరీ కరముతుల్లాబాషా, రమణ, కాంతారావు, బాలకేశవులు, రఘురామయ్య ఆంకులయ్య, వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వేణుగోపాలుడి కల్యాణోత్సవం

నెల్లూరు(బృందావనం): కృష్ణాష్టమి సందర్భంగా మూలాపేటలోని రుక్మిణీసత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీకృష్ణ అవతార మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. రాత్రి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ఉభయకర్తలుగా ఎ.రవికుమార్, ప్రియనందన దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను ధర్మకర్త, ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, కార్యనిర్వహణాధికారి దాసరి చంద్రశేఖర్‌రావు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గణేష్ విగ్రహ ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమంలో రోడ్డు క్రాసింగ్ వద్ద విద్యుత్ లైన్లు అడ్డుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి నూతనంగా క్రాసింగ్ లైన్లను ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం పలు ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుందని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ వాకర్స్ రోడ్డు, గుప్తా పార్క్, ములుమూడి, ఎస్‌ఎంఎస్, కోటమిట్ట, మన్సూర్ నగర్, పుత్తా ఎస్టేట్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పరమేశ్వరి నగర్, మనుమసిద్ధినగర్, పొర్లుకట్ట, గుప్తా పార్క్, బొమ్మా కేశవులు వీధి, పొర్లుకట్ట, జెండావీధి, కోటమిట్ట, గిడ్డంగివీధి, వీబీఎస్ కల్యాణ మండపం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

పాలుగోడు రైతులకు పరిహారమివ్వాలి

నెల్లూరు(దర్గామిట్ట): తెలుగుగంగ ఎస్ఎస్ కెనాల్‌లో భూములు కోల్పోయిన పాలుగోడు రైతులకు పరిహారమివ్వాలని తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ ఓబులేసును బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. సోమవారం ఆయన్ను కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కండలేరు జలాశయం నుంచి నీటిని తీసుకెళ్లే ప్రధాన కాలువ సోమశిల స్వర్ణముఖి కాలువలో డక్కిలి మండలంలోని పాలుగోడులో చిన్న, సన్నకారు రైతులు 60 మంది భూసేకరణలో భూములు కోల్పోయారని, 30 సంవత్సరాలుగా నష్టపరిహారం అందించలేదన్నారు.

ఘనంగా ఎల్‌ఐసీ వ్యవస్థాపక దినోత్సవం

నెల్లూరు(అర్బన్): ఎల్‌ఐసీ 68వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. దర్గామిట్ట డివిజనల్ కార్యాలయంలో, ఇంకా సీఏబీ బ్రాంచ్‌లో, సీబీ–1లో, బృందావనం సీబీ–2 బ్రాంచ్‌ల్లో వేడుకలు చేశారు. ఎల్‌ఐసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివిజనల్ కార్యాలయం వద్ద ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసీఈయూ) డివిజనల్ ప్రధాన కార్యదర్శి డి.ప్రసాద్ మాట్లాడారు. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తామని ఉద్యోగులు, ఏజెంట్లు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఎం కృష్ణమూర్తి, ఐసీఈయూ డివిజనల్ అధ్యక్షుడు సుందరబాబు, ఏఓఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, జిల్లా కార్యదర్శి సీహెచ్ నరసింహారావు, సీబీ–2 బ్రాంచ్‌లో ఏఓఐ నాయకులు హజరత్‌రెడ్డి, మేకల నరసింహారావు, సీఏబీ బ్రాంచ్‌లో మేనేజర్ ఆర్.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

అన్యాయంగా తొలగించేస్తున్నారు

- కలెక్టరేట్ వద్ద వీఓఏల ఆవేదన

నెల్లూరు(దర్గామిట్ట): 'ఏళ్ల తరబడి పొదుపు సభ్యుల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేశాం. సమాచారం ఇవ్వకుండా, నిబంధనలకు విరుద్ధంగా మమ్మల్ని తొలగించి పొట్ట కొడుతున్నారు' అని వీఓఏలు ఆవేదన చెందారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ 15 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నామన్నారు. పొదలకూరు మండలంలో ముగ్గురిని, మనుబోలు మండలంలో 17 మందిని, ఇలా దాదాపు 80 మందిని తొలగించారన్నారు. తప్పు చేస్తే తొలగించాలే కానీ ఇష్టారీతిన తీసేసి ఇబ్బంది పెట్టొద్దని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో శశికళ, భారతి, పార్వతి తదితరులున్నారు.



మాట్లాడుతున్న వీఓఏలు

నా మాట వినండి



యువకులకు నమస్కారం పెడుతున్న ఈయన పేరు చంద్రమౌళి. సౌత్ ట్రాఫిక్ ఎస్సై. బైక్‌లపై పరిమితికి మించి రాకపోకలు సాగిస్తున్న వారికి నమస్కారం పెట్టి మరోసారి ఇలా చేయొద్దని కోరుతున్నారు. అలాగే హెల్మెట్ ధరించి.. దానిని వినియోగించాలని వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

న్యాయవాదులకు అవగాహన

నెల్లూరు(లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులకు సోమవారం బ్యాంక్ రుణాలపై అవగాహన కల్పించారు. బ్యాంక్ సీనియర్ మేనేజర్ రాకేష్, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమ మహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్య యాదవ్ పాల్గొన్నారు.

సహాయ కార్యక్రమాలకు 200 మంది సిబ్బంది

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విజయవాడలో విద్యుత్ మరమ్మతులు, సహాయ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా నుంచి 200 మంది సిబ్బంది వెళ్లారు. ఇప్పటికే జిల్లాకు చెందిన పలువురు ఈఈలు విజయవాడకు చేరుకుని విద్యుత్ పునరుద్ధరణ, సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారని ఎస్ఈ విజయన్ తెలిపారు.

రేపు డీకేడబ్ల్యూలో అంతర్జాతీయ సదస్సు

నెల్లూరు(టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఈనెల 4వ తేదీన మల్టీ డిసిప్లినరీ విభాగంలో అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ గిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్న్‌షిప్ ఇన్ ఫుడ్ న్యూట్రిషియన్ అండ్ బయో ప్రొడక్ట్స్ అడ్వాన్స్ హెల్త్ త్రూ ఇన్నోవేషన్ అంశంపై అతిథులు ప్రసంగిస్తారని వెల్లడించారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ గోవిందు

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఎస్‌పీఎం విభాగపు హెచ్‌ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ గోవిందు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పలువురు డాక్టర్లు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరి

- కిలోవాట్ విద్యుత్‌కు రూ.2,350

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వినాయక చవితి సందర్భంగా ఉత్సవాల కోసం ఏర్పాటు చేసే మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరాకు అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ అన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాల నిర్వాహకులు రిజిస్ట్రేషన్ చేసుకుని సింగిల్ విండో విధానం ద్వారా అనుమతి పొందాలని సూచించారు. ఒక కిలోవాట్ విద్యుత్ కోసం రూ.2,350 నగదును మీ–సేవ కేంద్రాల్లో లేదా సచివాలయాల్లో లేదా ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌లో నగదును చెల్లించి సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల్లో ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఏఈలు వారి పరిధిలో తనిఖీలు చేయాలన్నారు. మండపాలను 11 కేవీ, 33 కేవీ విద్యుత్ లైన్ల కింద, ట్రాన్స్‌ఫార్మర్లకు ఆనుకుని ఏర్పాటు చేయకూడదని సూచించారు.

15 నుంచి నట్టల నివారణ మందు పంపిణీ

- పశుసంవర్థక శాఖ జేడీ కోటేశ్వరరావు

నెల్లూరు(అర్బన్): ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు నట్టల నివారణ మందు పంపిణీ చేస్తామని జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ వి.కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన రైల్వేఫీడర్స్ రోడ్డులోని కార్యాలయంలో వివరాలు వివరించారు. నట్టల నివారణ మందుతో గొర్రెలు, మేకల పేగులు, పొట్టలో ఉండే నట్టలు (నులిపురుగులు) నశిస్తాయన్నారు. మూడు నెలల వయస్సు దాటిన జీవాలకు ఈ మందు ఇవ్వవచ్చన్నారు. జిల్లాలో 10,95,197 గొర్రెలు, 3,86,929 మేకలకు మందు వేయనున్నట్లు వెల్లడించారు.

కార్పొరేషన్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో కమిషనర్ సూర్యతేజ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 55 వినతులు వచ్చాయన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి 19, టౌన్ ప్లానింగ్‌కు 17, పబ్లిక్ హెల్త్‌కు 3, రెవెన్యూకు 2, పెన్షన్‌కు 2, వెటర్నరీకి 7, హౌసింగ్ విభాగానికి 5 చొప్పున అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ శర్మద, ఎస్ఈ సంపత్‌కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, సీపీ దేవీకుమారి, మేనేజర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు(దర్గామిట్ట): ఆర్‌బీఐ 90 క్విజ్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆనంద్ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ 2024 సెప్టెంబర్ ఒకటో తేదీ తేదీ నాటికి 25 సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న వారు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.2 లక్షలు, రూ.1.50 లక్షలు, రూ.లక్ష నగదు బహుమతి అందజేస్తారన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొనాల్సిందిగా కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్.లవన్న, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, ఎల్‌డీఎం ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నో కన్నీటి గాథలు

- పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక
- 155 ఫిర్యాదుల అందజేత
- పరిష్కరించాలని ఎస్పీకి వేడుకోలు

నెల్లూరు(క్రైమ్): అత్తింటి వారు వేధిస్తున్నారు.. లోన్ ఇప్పిస్తానని నమ్మించి నగదు దోచేశారు.. అదృశ్యమైన వారి ఆచూకీ తెలియజేయాలి.. ఉద్యోగాల పేరిట మోసగించారు.. ఇలా ఒక్కొక్కరిది ఒక్కో కన్నీటి గాథ. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన 155 మంది తమ సమస్యలపై ఎస్పీ జి.కృష్ణకాంత్‌కు ఫిర్యాదులు చేశారు. ఆయన వాటిని పరిశీలించి చట్టపరిధిలోని వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోన్ పేరుతో మోసం

ఓ మహిళ నెల్లూరు నగరంలోని వేదాయపాళెంలో నివాసం ఉంటోంది. ఆమెకు సంగంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీనివాసులు స్నేహితుడు. అతను లోన్ ఇప్పిస్తానని చెక్కులు, ప్రామిసరీ నోట్స్ తీసుకున్నాడు. రోజులు గడుస్తున్నా లోన్ గురించి పట్టించుకోకపోవడంతో బాధిత మహిళ నిలదీసింది. కోపోద్రిక్తుడైన అతను ఆమెకు అసభ్యకర మెసేజ్‌లు పెడుతూ చెడుగా ప్రచారం చేయసాగాడు. విచారించి న్యాయం చేయాలని ఆమె ఎస్పీని కోరారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

రూ.3.50 లక్షలు కాజేశారు

నెల్లూరు చిన్నబజారు పోలీసుస్టేషన్ పరిధిలో శివకుమార్ నివాసం ఉంటున్నాడు. ఆయనకు ప్రభుత్వ శాఖలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని పొదలకూరు రోడ్డుకు చెందిన ప్రవీణ్ కుమార్, విజయవాడకు చెందిన మహేంద్రలు రూ.3.50 లక్షల నగదు తీసుకున్నారు. ఆ తర్వాత వారి నుంచి స్పందన లేదు. బాధితుడు నిలదీయగా తిట్టారు. దీనిపై శివకుమార్ ఫిర్యాదు చేశాడు.

అత్తింటివారు వేధిస్తున్నారు

అధనపుకట్నం కోసం అత్తింటివారు వేధింపులకు గురిచేస్తున్నారని, ఇంట్లో నుంచి తరిమేశారని నవాబుపేట, కావలి రూరల్ ప్రాంతాలకు చెందిన మహిళలు ఎస్పీకి విన్నవించారు. న్యాయం చేయాలని కోరారు.

వెల్లువలా తరలివచ్చి..

- వినతులిచ్చేందుకు కలెక్టరేట్‌కు పోటెత్తిన ప్రజలు
- టీడీపీ నేత మాట విని పింఛన్ తొలగించారు
- తూర్పుకంభంపాడు మహిళ ఆవేదన

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రతి వారం ప్రజలు వెల్లువలా తరలివస్తున్నారు. కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారం విషయంలో నిర్లక్ష్యంగా ఉండడమే దీనికి ప్రధాన కారణం. సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌కు జనం భారీగా తరలివచ్చి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ 292 అర్జీలు వచ్చాయన్నారు. ఉచితంగా అర్జీలు రాసే కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సరైన కారణం లేకుండా తిరస్కరించవద్దని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్.లవన్న, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, డీఈఓ రామారావు, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డ్వామా పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ఆనంద్‌తో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు



అర్జీల నమోదు కేంద్రం వద్ద జనం

పింఛన్ తొలగించారు



నేను దివ్యాంగురాలిని. నోటీస్ కూడా ఇవ్వకుండానే పింఛన్ తొలగించారు. కేవలం తెలుగుదేశం పార్టీ నేత చెప్పిన మాటతోనే పెన్షన్ తీసేశారు. అధికారులను అడిగినా సమాధానం చెప్పడం లేదు.
– ముక్కసాని పార్వతి, టీకేపాడు, చేజర్ల మండలం

ధాన్యం ధరలు పడిపోయాయి

ఖరీఫ్ సీజన్‌లో వరికోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పుట్టి రూ.18 వేలకు పడిపోయింది. మిల్లర్లు రోజురోజుకు ధరలు తగ్గిస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.
– ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు రాజగోపాల్, అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు

విద్యార్థినులను ఇబ్బంది పెడుతున్నారు

నెల్లూరు నగరం జెండావీధిలో పీఎస్‌ఎం మహిళా కళాశాల వద్ద అల్లరిమూకలు చేరి విద్యార్థినులను ఇబ్బందులు పెడుతున్నారు. మైనారిటీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి షఫీని నాగరాజు అనే ఉపాధ్యాయుడు కొట్టడంతో ముక్కు వద్ద గాయమై ఆస్పత్రిలో చేరాడు. ఆ విద్యార్థికి న్యాయం చేసి టీచర్‌పై చర్యలు తీసుకోవాలి.
– ముస్లిం ప్రజాసంఘాల నాయకులు

న్యాయం చేయాలి

మా ఆరు కుటుంబాలకు వివిధ సర్వే నంబర్లలో నాలుగు ఎకరాల భూమి ఉంది. మా గ్రామానికి చెందిన ఆరే శంకరనాయుడు అనే వ్యక్తి అది ప్రభుత్వ భూమి అంటూ రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి 300 నిమ్మ మొక్కలను పెరికించి వేశాడు. ఆ భూమిని 30 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నాం. పట్టాలు ఇప్పించి న్యాయం చేయాలి.
– కలువాయి మండలం మాదన్నగారిపల్లి గ్రామం ఎస్సీ కాలనీ వాసులు

మరమ్మతులు చేయించాలంటూ..

నెల్లూరు – తాటిపర్తి రోడ్డుకు మరమ్మతులు చేయించాలి. రూరల్ మండలంలో సుమారు 10 గ్రామాల ప్రజలు ఈ రోడ్డుపై నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వారి కోసం పనులు చేపట్టాలి.
– సీపీఎం నాయకులు

అక్రమ కట్టడాలు తొలగించాలి

నారాయణ మెడికల్ కళాశాల జంక్షన్ వడ్డిపాళెం వద్దనున్న బస్‌షెల్టర్‌ను, ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్ స్థలాన్ని, ఇరిగేషన్ కాలువను కొందరు ఆక్రమించారు. షాపులు నిర్మించి పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా చేశారు. రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న అక్రమ కట్టడాలను తొలగించాలి.
– కళాశాల విద్యార్థులు తదితరులు

పోరాటాలు చేస్తాం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు పోరాటాలు సాగిస్తామని ఎస్సీ వర్గీకరణ పరిరక్షణ కమిటీ పిలుపునిచ్చింది. నగరంలోని జగ్జీవన్‌రామ్ భవన్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. గౌరవ సలహాదారు సుబ్బయ్య మాదిగ మాట్లాడారు.